క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం షష్టి సందర్భంగా విశేష క్రతువులు నిర్వహించారు. స్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేపట్టారు. సుబ్రహ్మణ్యస్వామి వారికి పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం చేశారు.

నేడు గృహ ప్రవేశాలు

ఆత్మకూరు: పట్టణంలోని చక్రం హోటల్ వెనుకనున్న జగనన్న కాలనీలో పలువురు లబ్ధిదారులు నిర్మించుకున్న గృహాలను ఆదివారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంజాద్ అలీ శనివారం తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విజయవంతం చేయండి

ఆత్మకూరురూరల్: పెండింగ్‌లో ఉన్న పలు డిమాండ్ల సాధన కోసం ఈనెల 14వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామరెవెన్యూ సహాయకుల సంఘం మండల నాయకులు శ్రీనివాసులు,భూపాల్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. వీఆర్‌ఏలకు బయోమెట్రిక్ రద్దు చేయాలని, వేతనం రూ.26 వేలకు పెంచాలని, పెండింగ్‌లోని టీఏ, డీఏ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కొత్తపల్లి: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు ఈ.రాజు, నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం దుద్యాల గ్రామంలో మాదిగ పల్లె చైతన్యం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తొమ్మిదేళ్లు గడుస్తున్నా వర్గీకరణ ఊసేలేదని మండిపడ్డారు. మండల అధ్యక్షుడు సంపంగి మద్దిలేటి, ఎంఎస్పీ అధ్యక్షుడు నాగన్న, ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు బి.ఈశ్వర్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

వెలుగోడు: స్థానిక జూనియర్ కళాశాలలో భారత క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. నెహ్రూ యువ కేంద్రం జిల్లా ఆఫీసర్ రాహుల్ గిరి రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు 3 రోజుల పాటు యూత్ లీడర్ సిప్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ సహకారంతో శిక్షణ ఇచ్చామని తెలిపారు. చదువుతో పాటు వృత్తి విద్యలో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణ, ప్రేరణ రూరల్ డెవలప్ మెంట్ ప్రెసిడెంట్ నూలు నాగేశ్వరరావు, కేంద్ర ప్రభుత్వ వలంటీర్ సురేష్ కుమార్, రవికిశోర్ రెడ్డిపాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మిడుతూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ద్విచక్ర వాహనంపై కిశోర్, పెద్ద మల్లి శనగ పొట్టు లోడింగ్ కోసం నాగులాపురం వెళ్తుండగా మాసపేట నుంచి వస్తున్న కారు మలుపు వద్ద ఢీకొన్నాయి. దీంతో బైక్ వెనుకభాగంలో కుర్చున్న పెద్ద మల్లికి కారు బంపర్ తగలడంతో కాలు విరిగింది. కాగా బైక్ నడుపుతున్న కిశోర్‌కు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏఎస్‌ఐ సుబ్బయ్యను వివరణ కోరగా..ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

శివస్వాములకు ఉచిత వైద్యశిబిరం


ఆత్మకూరు: మండలంలోని ఎస్సార్‌బీసీ కాలనీ వద్ద కాలినడకన శ్రీశైల మహాక్షేత్రానికి తరలివెళ్తున్న శివస్వాములకు ఉచిత వైద్యశిబిరాన్ని కరివేన గ్రామ సర్పంచ్ మాణిక్యమ్మ శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కాలినడకన ఇబ్బందులు పడే భక్తులకు ఉచిత వైద్యశిబిరంలో సిబ్బంది వైద్యసేవలు అందజేస్తారని చెప్పారు. ఉమాదేవి,శారదా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. 16 మందికి గాయాలు

బొమ్మలసత్రం: బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు గ్రామ శివారులో శనివారం రాత్రి ఆటో బోల్తా పడి 16 మంది గాయపడ్డారు. అవుట్ పోస్ట్ పోలీసుల సమాచారం మేరకు.. నంద్యాల నుంచి వెలుగోడుకు వెలుతున్న ఆటోలో 11 మంది ప్రయాణికులు ఉన్నారు. ఏ కోడూరు శివారులో ఆటో ముందు టైర్ పంక్చర్ కావటంతో అదుపు తప్పి పక్కనే వెళ్తున్న బైక్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 11 మందితో పాటు బైక్‌పైనున్న ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ఆటోలో ఉన్న శివమ్మ, బైక్‌పై ఉన్న లిఖిత్ (4) పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు. బండిఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రకృతి ఒడిలో నాగలూటి

- శివ మాలధారులు, కన్నడ భక్తుల ఆరాధ్య దైవంగా వీరభద్రస్వామి
- శ్రీశైలం వెళ్లే భక్తులకు రక్షకుడిగా స్వామి వారు
- మహాశివరాత్రి, ఉగాది రోజుల్లో భక్తుల తొలిపూజ ద్వారపాలకుడికే
- ఆకట్టుకుంటున్న సెలయేర్లు, నల్లమల అందాలు
- చరిత్రకు ఆనవాళ్లుగా మెట్ల మార్గం



నల్లమలలో వెలిసిన నాగలూటి వీరభద్రస్వామిక్షేత్రం,(ఇన్‌సెట్) వీరభద్రస్వామి

ఆత్మకూరు: నల్లమల అయారణ్యంలో కొండ కోనలు, సెలయేర్లు, కోనేర్ల జలసవ్వడుల నడుమ వెలసింది నాగలూటి వీరభద్రస్వామి క్షేత్రం. ఈ క్షేత్రాన్ని దర్శించాలంటే కాలినడ వెళ్లాల్సిందే. కేవలం శివరాత్రి,ఉగాది రోజుల్లో మాత్రమే ఈ స్వామిని దర్శించుకోవడానికి అటవీఅధికారులు భక్తులకు అవకాశం కల్పిస్తున్నారు.

శివ మాలధారులు, కన్నడ భక్తుల ఆరాధ్య దైవం..

మహాశివరాత్రి, ఉగాది పర్వదినాల సందర్భంగా లక్షలాదిగా శ్రీశైల క్షేత్రానికి తరలివెళ్లే భక్తులకు ఆరాధ్య దైవంగా నాగలూటి వీరభద్రస్వామి పూజలందుకుంటున్నాడు. వందల కిలోమీటర్ల దూరం కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులు వీరభద్రస్వామికి తొలి మొక్కులు చెల్లిస్తారు. ఆ తరువాత మెట్ల మార్గం ద్వారా పెచ్చెర్వు, భీమునికొలను, కైలాస ద్వారం, హఠకేశ్వరం మీదుగా సాక్షిగణపతిని దర్శించి శ్రీశైల క్షేత్రానికి చేరుకుంటారు. శ్రీశైలం వెళ్లేవరకు కష్టాలు తమ దరి చేరకుండా రక్షిస్తాడని భక్తుల నమ్మకం.

రెడ్డిరాజులు నిర్మించిన మెట్ల మార్గం..

వెంకటాపురం గ్రామం నుంచి కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులకు నాగలూటి వీరభద్రస్వామి క్షేత్రం నుంచి క్రీ.శ 1326లో రెడ్డిరాజులు నిర్మించిన మెట్ల మార్గమే ప్రధాన దారి. ఈ ఒక్క దారి నుంచే వందల సంవత్సరాలుగా భక్తులు తరలివెళ్తున్నారు. తిరుపతి మెట్ల కంటే ఈ మెట్ల మార్గం అతికష్టమైంది. అయినప్పటికీ భక్తులు మెట్ల మార్గాన మహాశివుడిని, భ్రమరాంబాదేవిని దర్శించుకునేందుకు తరలివెళ్తారు.

క్షేత్రంలో చూడదగిన ప్రదేశాలు..

నాగలూటి వీరభద్రస్వామి సన్నిధిలో భక్తులను ఎంతగానో ఆకట్టుకునే ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. ప్రధానంగా రెడ్డిరాజులు నిర్మించిన మెట్ల మార్గం, మెట్ల మార్గం కింద రెండు కోనేరులు, సమీపంలోనే మహా శివలింగం, నంది విగ్రహాలతో పాటు ఎత్తైన వృక్షాలతో పాటు నల్లమల అందాలు, మెట్లు ఎక్కుతూ ఉంటే ఓ వైపు అందంగా కనిపించే పల్లెలు, ప్రకృతి అందాలు ఆహ్లాదాన్ని పంచుతాయి.

ఆదరణ కరువు..

ఎన్నో శతాబ్దాల చరిత్ర కలిగిన అతి పురాతనమైన నాగలూటి వీరభద్రస్వామి క్షేత్రం ఆదరణకు నోచుకోవడం లేదు. శ్రీశైల క్షేత్ర పాలకుడిగా కొలువు దీరిన వీరభద్రస్వామి ఆలయం శ్రీశైల దేవస్థానానికి దత్తత క్షేత్రంగా పేరుంది. మహాశివరాత్రి, ఉగాది పర్వదినాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు దర్శిస్తున్నప్పటికీ దేవస్థానం అధికారులు మాత్రం జనరేటర్ మినహా ఎలాంటి చలువ పందిళ్లు, తాగునీటి వసతి, మహిళలకు ప్రత్యేక సదుపాయాలు, భక్తులు సేదదీరేందుకు ఏర్పాట్లు చేయడం లేదు. ఆదరణ కరువడంతో ఆలయ ప్రాంగణం గుప్తనిధుల వేటగాళ్ల తవ్వకాలకు గురయ్యాయి. దీంతో ఆలయ ఆకారం, విగ్రహాలు ధ్వంసమయ్యాయి.



నాగలూటివద్ద మెట్ల మార్గం ద్వారా శ్రీశైల క్షేత్రానికి కాలి నడకన వస్తున్న భక్తులు





భక్తులను ఎంతగానో ఆకట్టుకునే నాగలూటి క్షేత్రంలోని కోనేరులు

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



మహాశివరాత్రి, ఉగాది సందర్భంగా కలినడకన వెళ్లే భక్తులకు ప్రత్యేక వసతులు కల్పించాలి. చలువ పందిళ్లు, రక్షిత మంచినీటి సౌకర్యంతో పాటు ఇతర సౌకర్యాలను శ్రీశైల దేవస్థానం అధికారులు కల్పించాలి. ముఖ్యంగా ఆలయ రక్షణకు చర్యలు చేపట్టాలి.

– వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ తండా, ఆత్మకూరు

అధికారులు స్పందించాలి



పర్వదినాల సమయంలో శ్రీశైల క్షేత్రం అధికారులు కనీస వసతులు కల్పించడం లేదు. చివరకు కారడవిలో గుక్కెడు నీటిని కూడా అందుబాటులో ఉంచడం లేదు. ఇక వైద్య సేవలు అందుబాటులో లేక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

–నాగేశ్వరరెడ్డి, వెంకటాపురం

మతసామరస్యం..



శివ స్వాములకు భోజనం వడ్డిస్తున్న ముస్లిం మైనార్టీలు

పాములపాడు: మండల కేంద్రంలో శివస్వాములకు స్థానిక ముస్లిం మైనార్టీలు శనివారం భిక్ష ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటారు. శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో శివ మాలధారులకు స్థానిక వీర బ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమ ఆవరణంలో భిక్ష ఏర్పాటు చేశారు. అలాగే.. శ్రీశైలానికి కాలినడకన వెళ్తున్న భక్తులకు కూడా భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ పెద్దలు మహబూబ్‌బాషా, ఉస్మాన్, కాశీం, గఫూర్, ఇస్మాయిల్, సుభాన్, నన్నెసా, చాంద్‌బాషా, అష్రఫ్‌అలీ, మౌలాలి పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి కేసు ఛేదన

పగిడ్యాల: గత నెల 26న శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో లభించిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కేసు మిస్టరీని ఛేదించినట్లు ఎస్‌ఐ నాగార్జున శనివారం తెలిపారు. కృష్ణానది పరివాహక గ్రామాల వెంట చేపలు వేట సాగించే మత్స్యకారులను విచారించగా..మృతుడిది చత్తీష్‌గఢ్ రాష్ట్రం సుకుమ జిల్లా కుంట గ్రామంగా తెలిసిందన్నారు. మత్స్యకారుడు నాగేశ్వరరావు ఇచ్చిన సమాచారం మేరకు మృతుడి అన్నదమ్ములు నాగేష్, మహేష్‌ను పిలిపించామని పేర్కొన్నారు. మృతుడి పేరు సతీష్ అలియాస్ సత్తిగా, వయస్సు 24 ఏళ్లుగా నిర్ధారణ అయ్యిందని చెప్పారు. అయితే మృతుడు ప్రమాదవశాత్తు చనిపోయాడా లేక హత్య చేయబడ్డాడా అనేది ల్యాబ్ రిపోర్టు రావాల్సి ఉందన్నారు. మృతుడి అన్నదమ్ముల ఫిర్యాదు మేరకు అనుమానితులపై కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఆధార్‌కార్డులు కలిగిన మత్స్యకారులే శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో చేపలు పట్టాలని, వ్యాపారులు కూడా గుర్తింపు కార్డులున్న వారితోనే చేపలు పట్టించాలని సూచించారు.




ముసలిమడుగు గ్రామ శివారులో చేనుకు రక్షణగా కట్టిన చీరలు

పంటకు రక్షణగా..

కొత్తపల్లె: అటవీ సమీపంలో పంటలను జంతువులను రక్షించుకోవడానికి రైతులు వివిధ రకాల చర్యలు చేపడుతున్నారు. రబీలో భాగంగా సాగు చేసిన మొక్కజొన్న, వేరుశనగ, వరి తదితర పంటలను కాపాడుకునేందుకు చీరలను అడ్డుగా కడుతున్నారు. ముఖ్యంగా అడవి పందులు పంటలను నాశనం చేయకుండా వీటిని అడ్డుగా కడుతున్నారు. అడవి పందులకు అడ్డుగా ఏదైనా తగిలితే అవి అటు వైపు వెళ్లవని, దీంతో ఇలా చీరలను అడ్డుగా ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. అలాగే మేకలు, గొర్రెలు, పాడి పశువులు తదితర వాటి నుంచి కూడా పంటలను రక్షించుకోవచ్చని చెబుతున్నారు.

గ్యాస్ సిలెండర్ పేలి గుడిసె దగ్ధం



గుడిసెలో కాలిపోయిన సామగ్రి

ఆత్మకూరు: పట్టణంలోని అర్బన్‌కాలనీలోని శనివారం రాత్రి గ్యాస్‌సిలెండర్ ప్రమాదవశాత్తు పేలి ఓ పూరిగుడిసె దగ్ధమైంది. ఈరమ్మ అనే మహిళకు చెందిన పూరిగుడిసెలో గ్యాస్ సిలెండర్ పేలడంతో పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని ధాన్యం, వస్త్రాలు, వంట సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. గ్యాస్ సిలెండర్ పేలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. తనను ఆదుకోవాలని బాధితురాలు కోరింది.

దివ్యాంగులకు ఉచిత కంటి వైద్య శిబిరం

నంద్యాల(వ్యవసాయం): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాలకు రెండో రోజు పట్టణంలో విశేష స్పందన లభించినట్లు రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ జిల్లాలో 9 వికలాంగ పాఠశాలల్లో దాదాపు 500 మందికి కంటి పరీక్షలు చేసినట్లు చెప్పారు. వెలుగోడు క్రాంతి వికలాంగుల పాఠశాల, పెద్ద కొట్టాలలోని భారతీ ఎడ్యుకేషన్ పాఠశాల, ఆళ్లగడ్డలోని బాలికల వసతి గృహం, నంద్యాల క్రాంతినగర్‌లోని బ్లైండ్ స్కూల్, చామకాల్వ వద్ద ఉన్న ఉషామనోవికాస్ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశాని పేర్కొన్నారు. కో ఆర్డినేటర్లు ప్రేమ్‌సాగర్, దేవయ్య, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు యాకూబ్, ఉస్మాన్‌బాషా, బాలుడు, మునీరుద్దీన్, హలీమా, విజయకాంత్ పాల్గొన్నారు.

నీటి తరలింపుపై అభ్యంతరం



ఈఓఆర్డీతో వాగ్వాదానికి దిగిన స్థానికులు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ వీరాపురం కాలనీ సమీపంలో చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణానికి నీటి తరలింపుపై స్థానిక ఎస్సీ కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ అధికారులతో వాగ్వాదానికి దిగిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఓ వైపు ప్రభుత్వం ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాల టార్గెట్ పూర్తి కావాలనే ఆదేశాల నేపథ్యంలో మండల స్థాయి అధికారులు ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. అయితే నెహ్రూనగర్‌లో నీటి సమస్య కారణంగా పురోగతి మందగించిందని తెలుసుకున్న పంచాయతీ అధికారులు వీరాపురం ఎస్సీ కాలనీలోనున్న జీఎల్ఎస్ఆర్ ట్యాంక్ నుంచి నీటిని తరలించేందుకు చర్యలు చేపట్టారు. ట్యాంక్ నుంచి వృథాగా పోయే నీటిని తాత్కాలిక పైప్‌లైన్ ద్వారా జగనన్న కాలనీకి తరలించేందుకు చేపట్టిన పనులను స్థానికులు అడ్డుకోవడం పోలీసుల దృష్టికి వెళ్లింది. సర్పంచ్ రాజేశ్వరి, ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ స్థానికులను ఒప్పించడానికి చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టడంతో ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వీరన్న యాదవ్‌ను వివరణ కోరగా జగనన్న కాలనీలో నీటి సమస్య తలెత్తడంతో నాలుగు రోజులుగా నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో వీరాపురం ఎస్సీ కాలనీలో ట్యాంక్ నుంచి ఓవర్ ఫ్లో నీటిని తరలించడానికి తాత్కాలికంగా పైప్‌లైన్ వేయిస్తున్నాం. ఈ పనులను కొంత మంది అడ్డుకోవడంతో పనులు చేసేందుకు రక్షణగా పోలీసులను పంపాలని ఎస్‌ఐ నాగార్జునకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు.

రోడ్డు నిర్మించాలి

జూపాడుబంగ్లా: మండలంలోని సిద్దేశ్వరం గ్రామానికి రోడ్డు నిర్మించాలని సీపీఐ నాయకుడు రమేష్ బాబు కోరారు. శనివారం నిర్మాణానికి నోచుకోని కొత్త సిద్దేశ్వరం గ్రామ రోడ్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో గ్రామానికి రోడ్డు మంజూరు కాగా ఇప్పటిదాకా రోడ్డు నిర్మాణానికి నోచుకోకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పారుమంచాల నుంచి కొత్తసిద్దేశ్వరం వరకు చిప్స్ డస్టు తోలి వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని రోడ్డు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నాయకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

18న జాతీయస్థాయి కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఈ నెల 18వ తేదీన జాతీయ స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా దాతల సహకారంతో నిర్వహిస్తున్న పోటీలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన విజేత జట్లకు తొలి ఆరు స్థానాలకు గాను వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.500లు ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 81427 47710, 93460 94529 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇరుముడితో శ్రీశైలం పయనం



శ్రీశైలానికి కాలినడకన బయలుదేరిన శివస్వాములు

పగిడ్యాల: నెహ్రూనగర్‌లో శివదీక్ష స్వీకరించిన మాలధారులు శనివారం ఇరుముడి స్వీకరించి శ్రీశైలానికి కాలినడకన బయలుదేరారు. దీంతో మాలధారులను బంధువులు, కుటుంబసభ్యులు,స్నేహితులు ప్రత్యేకంగా పూజించి సాగనంపారు. శివ నామస్మరణతో గ్రామ పురవీధులు మారుమోగాయి.

నిప్పుల వాగుకు 1,100 క్యూసెక్కుల నీరు విడుదల

పాములపాడు: మండలంలోని కేసీ కెనాల్ 120వ కి.మీ. లాకిన్స్‌లా నుంచి నిప్పుల వాగుకు శనివారం 1,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సుంకేసుల నుంచి వెయ్యి క్యూసెక్కులు కేసీకి విడుదలవుతున్నాయని, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి 750 క్యూసెక్కుల నీరు విడుదలవుతోందన్నారు. కాగా లాకిన్స్‌లా వద్దకు 1,500 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉందని చెప్పారు. అక్కడి నుంచి నిప్పులవాగుతో పాటు తూడిచెర్ల సబ్ చానల్‌కు 350 క్యూసెక్కులు, అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 40 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు వివరించారు.

నల్లమలలో ట్రాఫిక్ జాం



రోళ్లపెంట వద్ద నిలిచిపోయిన లారీ

ఆత్మకూరు: నల్లమల అటవీ పరిధిలోని కర్నూలు –గుంటూరు ప్రధాన రహదారిలోని రోళ్లపెంట ఘాట్‌లో లారీ బ్రేక్‌డౌన్ కావడంతో కొండ ఎక్కలేక నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో దాదాపు రెండు గంటల పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కర్నూలు నుంచి విజయవాడకు వెళ్తున్న ఓ లారీ నల్లమల అరణ్యంలోని రోళ్లపెంట ఘాట్ వద్ద పైకి ఎక్కలేక అడ్డంగా నిలిచిపోయింది. దీంతో కర్నూలు నుంచి విజయవాడకు వెళ్లే వాహనాలు శ్రీశైలం, విజయవాడ,ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి కర్నూలు వైపు వచ్చే వాహనాలు నిలిచిపోయాయి. రెండు గంటల అనంతరం ఆత్మకూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ ద్వారా లారీని పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించేందుకు శ్రీశైల దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా శనివారం నిత్య కళారాధన వేదిక వద్ద నంద్యాలకు చెందిన శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ వారి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అలాగే పుష్కరిణి వద్ద శ్రీకాళహస్తికి చెందిన సుకన్య బృందం వారి భరతనాట్యం, తిరువూరుకు చెందిన గోదా నరసింహారావు బృందం వారి భక్తిరంజని, శ్రీకాకుళంకు చెందిన భారతి రమేష్ వారి కచేరి భక్తులను ఆకట్టుకున్నాయి. శివదీక్షా శిబిరాల వద్ద హైదరాబాద్‌కు చెందిన క్రాంతి, బృందం కూచిపూడి నృత్యప్రదర్శన, ప్రకాశం జిల్లా కు చెందిన ఎం.లక్ష్మీ రెడ్డి, పట్టాభిరామ కళానాట్య మండలి వారి వీరబ్రహ్మేంద స్వామి చరిత్ర పౌరాణిక నాటకం, విజయవాడకు చెందిన శ్రీనివాస నాట్య మండలి శివ లీలలు, మోహినీ విజయం పౌరాణిక నాటకాలు అలరించాయి.

భక్తుల సేవలో ఫైర్ సిబ్బంది



విధుల్లో చేరిన ఫైర్ సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఫైర్ అధికారులు 11 రోజుల పాటు సేవలందించనున్నారు. శనివారం దేవస్థాన వైద్యశాల వద్ద ఫైర్ ఇంజిన్‌తో విధుల్లోకి చేరారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ పర్యవేక్షణలో అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు–11మంది, లీడింగ్ ఫైర్‌మెన్స్–18 మంది, డైవర్లు, ఆపరేటర్లు–18 మంది, 41 మంది సిబ్బంది, 2 హోంగార్డులతో మొత్తం 92 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. క్షేత్ర పరిధిలో వైద్యశాల, అమ్మవారి ఆలయం వెనుక, పాతాళగంగ, లింగాలగట్టు పాతాళగంగ వద్ద వామనాలను ఏర్పాటు చేశారు.

దుమ్ముతో భక్తులకు అసౌకర్యం



దుమ్ముతో నిండిపోయిన శ్రీశైలం రోడ్డులో అవస్థలు పడుతున్న వాహనదారులు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వాహనాల్లో తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖద్వారం నుంచి శ్రీశైలం వరకు రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ పనులను చేయాలని ఆదేశించినా..సకాలంలో పూర్తిచేయలేదు. శనివారం కూడా పనులు చేస్తుండటంతో మట్టి, దుమ్ము రోడ్డుపైకి చేరుకుంటుండంతో భక్తులకు అసౌకర్యంగా మారింది. అధికారులు ముందుగానే పనులు చేసి ఉంటే ఈ ఇబ్బందులు తలెత్తేవి కాదని పలువురు భక్తులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం



గాజులపల్లెలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మండలంలోని గాజులపల్లెలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్ల గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. నల్లమలలో వెలిసిన శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయంలో కొలువైన ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు. లోక కల్యాణం కోసం నరసింహస్వామి మాలధారులు భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. స్వామివార్ల దంపతులకు అభిషేకం, అర్చన చేపట్టారు.

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

జూపాడుబంగ్లా: సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, ఘర్షణలకు పాల్పడవద్దని నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి పి.దివాకర్, జూనియర్ సివిల్ జడ్జి పి.తిరుమలరావు తెలిపారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రపజలు ప్రశాంత జీవితాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సమస్యలు నెలకొన్నప్పుడు వాటిని పెద్దమనుషుల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని, అలా కాకుండా ఘర్షణలకు పాల్పడి పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేయించుకోవద్దని చెప్పారు. అనంతరం నందికొట్కూరు, జూపాడుబంగ్లా, ముచ్చుమర్రి, బ్రాహ్మణకొట్కూరు, మిడ్తూరు పోలీసుస్టేషన్‌ల పరిధిలో నమోదైన 188 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.



నందికొట్కూరులో కేసులను పరిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి పి.తిరుమలరావు



లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

లోక్ అదాలత్‌లో 85 కేసుల పరిష్కారం

ఆత్మకూరు: స్థానిక కోర్టులో శనివారం జరిగిన లోక్‌అదాలత్ కార్యక్రమంలో 85 కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి రఘునాథ్ తెలిపారు. వారు మాట్లాడుతూ 24 క్రిమినల్ కేసులు, 4 సివిల్ కేసులు, 53 సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు క్రిమినల్ కేసులు, 4 యూనియన్ బ్యాంక్ పాములపాడు శాఖకు చెందిన కేసులు పరిష్కరించినట్లు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాబు రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.